ఈనాడు
చిత్తూరు
బుధవారం అక్టోబరు 2, 2024



5,145 బందోబస్తుకు వినియోగించనున్న పోలీసు, తితిదే సెక్యూరిటీ. సైబర్‌క్రైమ్ పోలీసుల ద్వారా సోషల్‌మీడియాలో వ్యాపించే వదంతుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు.

5 గరుడసేవ రోజు రద్దీ ఎక్కువైతే తిరుపతి నగర శివారులో ఏర్పాట్లు చేయనున్న హోల్డింగ్ పాయింట్లు. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సుల్లో తిరుమలకు భక్తుల రవాణా.

2,700 అత్యాధునిక సీసీ కెమెరాలు, నిఘా నియంత్రణ కేంద్రాలతో నిరంతర పర్యవేక్షణ. ఈ సంవత్సరం నూతనంగా 'వీడియో ఎనలైజింగ్ టెక్నాలజీ' సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు.

2 లక్షలు శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్యాలరీల్లో వాహన సేవలు వీక్షించనున్న భక్తులు. అదనంగా నాలుగు మాడ వీధుల్లోని మూలల వద్ద మరో 80 వేల మందికి అవకాశం.

24 తిరుమలలో పార్కింగ్ ప్రాంతాలు. తిరుపతిలో మరో ఐదు ఏర్పాటు. తిరుమలకు ఎనిమిది వేల వాహనాల వరకు అనుమతి. ఆపై ఆర్టీసీ బస్సుల్లోనే అనుమతి.

బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు

వెలుగుల రేడు.. ఆపద మొక్కులవాడు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి నవహ్నిక బ్రహ్మోత్సవాలకు సప్తగిరులు ముస్తాబయ్యాయి. పెరటాసి మాసం, సెలవుల నేపథ్యంలో లక్షల సంఖ్యలో భక్తులు స్వామివారి వాహన సేవలను దర్శించుకోనున్నారు. గరుడోత్సవం రోజున భారీగా శ్రీవారిని దర్శించుకోనున్నారన్న అంచనాతో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. మాడవీధుల్లో గ్యాలరీల ఏర్పాటు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు సిద్ధం చేశారు. ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం, పోలీసు శాఖ సిబ్బంది సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేసింది. సామాన్య భక్తులకు ప్రాధాన్యమిచ్చేలా, వారు సులువుగా శ్రీవారి వాహన సేవల్లో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గత బ్రహ్మోత్సవాల అనుభవాల నేపథ్యంలో పొరపాట్లకు తావులేకుండా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.



రాంభగీచా వద్ద కంట్రోల్ రూమ్

శోభాయమానంగా తిరుమల



తిరుమల క్షేత్రం బ్రహ్మోత్సవాల వేళ విద్యుత్తు వెలుగులతో ధగధగలాడుతోంది. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అలంకరణలు పూర్తిచేశారు. కల్యాణవేదికలో ఫల, పుష్ప ప్రదర్శన ఏర్పాట్లు చేపట్టారు. ఈసారి ప్రత్యేకంగా సీతా స్వయంవరం, అటవీశాఖ ఆధ్వర్యంలో ఏడుకొండలపై శ్రీనివాసుడు పవళించిన నమూనా సిద్ధం చేశారు. శ్రీవారి ఆలయం, దేవతా ప్రతిమలు మిరుమిట్లు గొలుపుతున్నాయి.

కొత్తగా తరలింపు బృందాలు

శ్రీవారి మాడవీధుల్లోకి ప్రవేశించే భక్తులకు నాలుగింటిలోనూ ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో తొక్కిసలాటలు నివారించేందుకు తితిదే ఆధ్వర్యంలో తరలింపు టీమ్‌లు ప్రత్యేకంగా ఈ సంవత్సరం నుంచి అందుబాటులోకి తేనున్నారు. గ్యాలరీల నుంచి బస్టాండ్ వరకు భక్తులను తరలించడం వీటి బాధ్యత. బందోబస్తుకు వచ్చిన పోలీసులు స్థానికుల దర్శన టికెట్లు పొందడం, బంధువులను గ్యాలరీల్లోకి అనుమతించడం చేస్తే కఠిన చర్యలు ఉంటాయి. వీవీఐపీలు, వీఐపీలు, ప్రెస్, ఉద్యోగులకు పాస్‌లు సిద్ధం చేశారు.

4న సీఎం పట్టువస్త్రాల సమర్పణ

శుక్రవారం సాయంత్రం ధ్వజారోహణ సందర్భంగా శ్రీవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అనంతరం శ్రీవారిని దర్శించుకుంటారు. మాడవీధుల్లో పెద్దశేష వాహన సేవలో పాల్గొంటారు.

తనిఖీ చేశాకే అనుమతి: డీజీపీ

ఇన్నర్ రింగ్‌రోడ్డు నుంచి గ్యాలరీలోకి భక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే క్యూలైన్లలో అనుమతిస్తామని డీజీపీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. తితిదే విజిలెన్స్, పోలీసు శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. గరుడసేవ రోజున వాహనాలను పైకి అనుమతించబోమని, క్యూఆర్‌కోడ్ సాయంతో కిందనే పార్కింగ్ చేసుకోవాలని, సురక్షిత ప్రయాణానికి భక్తులు ప్రజారవాణాను ఉపయోగించాలని కోరారు.

కాషాయ ధారణలో.. ప్రాయశ్చిత్త దారిలో..



ఆంజనేయ స్వామి జెండా చేతబూని అలిపిరి మెట్లు ఎక్కుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తిరుమల, తిరుపతి పర్యటన నిమిత్తం మంగళవారం మధ్యాహ్నం 3.15 గంటలకు ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రత్యేక కాన్వాయ్ వెంట రాగా పద్మావతి అతిథిగృహానికి చేరుకున్నారు. అనంతరం అలిపిరి వద్దకు చేరుకోగా జనసేన నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున అక్కడికి తరలివచ్చారు. స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన నేత హరిప్రసాద్, పార్టీ నేతలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక భద్రత నడుమ ఆయన తిరుమలకు కాలినడకన చేరుకున్నారు.





భక్తురాలికి నమస్కరిస్తూ.. ● తితిదే పారిశుద్ధ్య కార్మికురాలిని పలకరిస్తూ..

ఆపరేషన్.. అస్పియా



- చిత్తూరు జిల్లా పోలీసులకు సవాల్‌గా ఏడేళ్ల బాలిక అదృశ్యం
- రెండు రోజులుగా పుంగనూరులోనే ఎస్పీ.. తాజాగా డీఐజీ రాక

ఈనాడు, చిత్తూరు- న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ: పుంగనూరు పట్టణంలోని ఉబేదుల్లా కాంపౌండ్‌కు చెందిన ఏడేళ్ల బాలిక అస్పియా అంజుమ్ అదృశ్యం కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. రెండు రోజులుగా చిన్నారి ఆచూకీ గురించి స్థానిక పోలీసులు, క్రైమ్ బ్రాంచ్ ఆరా తీస్తోంది. ఫైనాన్స్ వ్యాపారం చేసే అజ్మతుల్లా, షమియా దంపతుల కుమార్తె అస్పియా ఆదివారం రాత్రి ఏడు గంటల సమయంలో ఇంటి వద్ద ఆడుకుంటూ కనిపించలేదు. అదేరోజు 10 గంటల వరకు తల్లిదండ్రులు బంధువులు, స్థానికులను విచారించినా ఆచూకీ దొరక్కపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఎస్పీ మణికంఠ చందోలు మిస్టరీని ఛేదించేందుకు ముగ్గురు డీఎస్పీలు, ఐదుగురు సీఐలు, మరో ఐదుగురు ఎస్సైలను నియమించారు. మొత్తంగా 11 బృందాలు విచారణ జరుపుతున్నాయి. చిత్తూరు, రాయచోటి నుంచి రెండు డాగ్‌స్క్వాడ్‌ను రంగంలోకి దింపినా పెద్దగా ఆధారాలు లభించలేదు. బాలిక అదృశ్యమైన ప్రాంతంలో సీసీ కెమెరాలు ఎక్కువ సంఖ్యలో లేకపోవడం.. ఉన్నవీ మరమ్మతులకు గురవ్వడం సమస్యగా మారింది. ఎస్పీ సైతం రెండు రోజులుగా పుంగనూరులోనే ఉంటూ తల్లిదండ్రులు, స్థానికులు, బంధువులతో మాట్లాడుతున్నారు. అన్ని కోణాల్లోనూ విచారిస్తున్నారు. ఆచూకీ కనుక్కోవడానికి శ్రమిస్తున్నా పెద్దగా పురోగతి లేదు. బాలిక తండ్రి ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నందున ఆర్థిక లావాదేవీల కారణంగా ఎవరితోనైనా విభేదాలు తలెత్తి కిడ్నాప్‌కు దారి తీసిందా? అని దర్యాప్తు చేస్తున్నారు. అనంతపురం డీఐజీ షేముషి బాజ్‌పాయి మంగళవారం పుంగనూరుకు రావడంతో కేసు ప్రాధాన్యం సంతరించుకుంది. తల్లిదండ్రులను అడిగి ఆమె వివరాలు తెలుసుకున్నారు. ఎవరిపైనైనా అనుమానం ఉందా? అంటూ ఆరా తీశారు. సామాజిక మాధ్యమాల్లోనూ బాలిక ఫొటో, వివరాలు పోస్టు చేసి ఎవరికైనా సమాచారం ఉంటే తెలియజేయాలని సూచించారు.

దర్యాప్తు చేస్తున్నా అంతుపట్టక



ఎస్పీ మణికంఠ, పోలీసులతో మాట్లాడుతున్న అనంతపురం డీఐజీ షేముషి బాజ్‌పాయి

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పుంగనూరులో సంచలనం రేపుతున్న అస్పియా అంజుమ్ అదృశ్యం కేసు విషయమై అనంతపురం రేంజ్ డీఐజీ షేముషి బాజ్‌పాయి మంగళవారం పుంగనూరు పోలీసు స్టేషన్‌కు వచ్చారు. కేసును శోధించేందుకు చిత్తూరు, కడప జిల్లాల నుంచి ప్రత్యేక నిపుణులను పిలిపించినట్లు సమాచారం. పోలీసులు విస్తృతంగా పరిశోధిస్తున్నా ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. కేసు విషయమై జిల్లా ఎస్పీని వివరణ కోరగా ఇది చాలా సున్నితమైన కేసు, దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

పల్లె వెతలు బాపు

భారతదేశ ఆత్మ పల్లెల్లో ఉందనేది మహాత్ముడి ప్రగాఢ విశ్వాసం. దేశ సామాజిక, రాజకీయ వ్యవస్థకు గ్రామాలు కేంద్ర బిందువులు కావాలని ఆయన ఆకాంక్షించారు. అవి స్వయంపాలన, ఆర్థిక పరిపుష్టి సాధించాలని కోరుకున్నారు. అటువంటి కీలకమైన పల్లెల అభివృద్ధిని ఐదేళ్లపాటు వైకాపా ప్రభుత్వం గాలికి వదిలేసింది. గ్రామీణ స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసింది. ప్రజాప్రతినిధులను ఉత్సవ విగ్రహాలుగా మార్చి వేడుక చూసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధిపై ఆశలు చిగురించాయి. నేడు మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా పల్లెల పురోభివృద్ధికి కూటమి సర్కార్ వేస్తున్న అడుగులు ఇలా.. – ఈనాడు, చిత్తూరు



వైకాపా హయాంలో నిర్వీర్యమైన గ్రామీణ స్థానిక సంస్థలు

పురోభివృద్ధికి కూటమి సర్కార్ శరవేగంగా అడుగులు

నేరుగా పంచాయతీల ఖాతాల్లోకే

వైకాపా హయాంలో 14, 15వ ఆర్థిక సంఘం నుంచి వచ్చిన నిధులు వచ్చినట్టే విద్యుత్తు బకాయిలకు జమ చేసుకున్నారు. తాగునీటి బోర్లను కూడా మరమ్మతు చేయలేకపోయారు. విషజ్వరాలు విజృంభిస్తున్నా బ్లీచింగ్ చల్లే పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.29.23 కోట్లు రాగా అవన్నీ పంచాయతీల ఖాతాల్లోనే జమ చేశారు.

1,474 ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పంచాయతీలు

వైకాపా హయాంలో విద్యుత్తు బకాయిలకు మళ్లించిన నిధులు **రూ. 140 కోట్లు**

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం



చిత్తూరు నగరం వన్నియర్ బ్లాక్‌లో పారిశుద్ధ్య తనిఖీలు చేస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్

జగన్ పాలనలో గ్రామాల్లో అపరిశుభ్రం రాజ్యమేలింది. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక పరిస్థితిలో మార్పు వచ్చింది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రాలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. గ్రామాల్లోని చెత్తను సేకరించి దాన్ని ఆదాయ వనరుగా మార్చాలనే దిశగా అడుగులు వేస్తున్నారు.

పరిశ్రమలకు ఖిల్లాగా మార్చాలని

పల్లెల్లోని యువత ఉపాధి కోసం పట్టణాల బాట పట్టకూడదన్నది బాపూ ఆకాంక్ష. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువమంది ఆధారపడ్డ పాడి, ఉద్యాన, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలని భావిస్తోంది. రాష్ట్రంలో అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాలతోపాటు చిత్తూరు జిల్లానూ పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి చిన్న తరహా పరిశ్రమలకు ఖిల్లాగా మార్చేందుకు అడుగులు వేస్తోంది.



ఎంఎస్ఎంఈలపై ఇటీవల కలెక్టరేట్‌లో నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరైన ఔత్సాహికులు

పాడి పరిశ్రమకు చేయూత



కుప్పం మండలం చెక్కునత్తంలో గోకులం షెడ్డు నిర్మాణానికి భూమిపూజ

2014-19 మధ్య ఉమ్మడి జిల్లాలో **10 వేలు** మంజూరైన గోకులాలు

నిర్మాణం పూర్తయినవి **8 వేలు** | పెండింగ్ బిల్లులు **రూ. 12 కోట్లు**

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలంటే తేనెటీగల పెంపకం, పశుపోషణ, ఖాదీ తయారీ వంటివి ముఖ్యమని మహాత్ముడు భావించారు. 2014-19 మధ్య తెలుగుదేశం హయాంలో పశువులకు నీడను ఇచ్చేందుకు షెడ్ల నిర్మాణం చేపట్టేందుకు 'మినీ గోకులం' పథకాన్ని తీసుకువచ్చింది. ఉమ్మడి జిల్లాలో 10 వేల గోకులాలు మంజూరు చేయగా 8 వేలు నిర్మించారు. వీటికి సంబంధించి రూ.12 కోట్ల బిల్లులను వైకాపా ప్రభుత్వం విడుదల చేయలేదు. ఇటీవల పాలనా పగ్గాలు చేపట్టిన కూటమి సర్కార్ పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటోంది. షెడ్ల నిర్మాణానికి గొర్రెలు-మేకలు, కోళ్ల రైతులకు 70 శాతం రాయితీ, పాడి రైతులకు 90 శాతం రాయితీ ఇస్తోంది. కుప్పం నియోజకవర్గంలో ఇప్పటికే 593 మంజూరు చేయగా పనులు జరుగుతున్నాయి.

గ్రామ సభలు నిర్వహించి.. పనులు పట్టాలెక్కించి

అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చిస్తోన్న నిధులు రూ. 185.30 కోట్లు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఒకేరోజు ఆగస్టు 23న 1,474 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి రికార్డు సృష్టించారు. వైకాపా హయాంలో ప్రజలందరి భాగస్వామ్యంతో పనులు గుర్తించిన దాఖలాలు ఐదేళ్లలో లేవు. ఇందుకు భిన్నంగా కూటమి సర్కార్ అడుగులు వేసింది. ఉపాధిహామీ నిధులతో సీసీరోడ్లు, కుళాయి కనెక్షన్లు, వీధిదీపాలు, మరుగుదొడ్లు, పంట కుంటలు ఇలా ఏయే అభివృద్ధి కార్యక్రమాలు చేయాలో ప్రజల నుంచే అభిప్రాయాలు స్వీకరించారు. ప్రస్తుతం రూ.91.30 కోట్లతో గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి.

దసరా సెలవులు.. బస్టాండ్ కిటకిట

విద్యార్థులకు దసరా సెలవులు బుధవారం నుంచి 13వ తేదీ వరకు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో వసతి గృహాల్లోని విద్యార్థులు సొంతూళ్లకు బయల్దేరారు. కొందరు మిత్రులతో కలసి ఊర్లకు పయనం కాగా, మరికొందరిని తల్లిదండ్రులు వసతి గృహాల వద్దకు వెళ్లి ఇంటికి తీసుకెళ్లారు. వీరందరి రాకతో చిత్తూరు నగర ఆర్టీసీ ప్రాంగణం రద్దీగా కనిపించింది. బస్సులు రాగానే ఎక్కేందుకు పోటీపడ్డారు. – ఈనాడు, చిత్తూరు






▸ తల్లితో కలసి ఇంటికి పయనమైన విద్యార్థి ▸ ఇంటికి బయలుదేరిన విద్యార్థిని



ఊరికి వెళ్లేందుకు బస్సుల వద్ద రద్దీ



వాహనంలో ఇంటికి తీసుకెళ్తూ..

సర్వదర్శనానికి 18 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా మంగళవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దాదాపు 18 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 టికెట్లు కలిగిన వారికి మూడు గంటల సమయం పడుతోంది. సోమవారం శ్రీవారిని 66,986 మంది దర్శించుకున్నారు. రూ.5.05 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

టెట్ పరిశీలకుడిగా ప్రసన్నకుమార్

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: టెట్ పరిశీలకుడిగా పబ్లిక్ లైబ్రరీ డైరెక్టర్ ప్రసన్నకుమార్‌ను ప్రభుత్వం నియమించిందని డీఈవో దేవరాజు మంగళవారం తెలిపారు. ఆయన చిత్తూరు, తిరుపతి జిల్లాలతో పాటు చెన్నై పరీక్ష కేంద్రాలను పర్యవేక్షిస్తారన్నారు. టెట్ ఈ నెల 3నుంచి 21 వరకు జరగనుంది. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు; మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని చెప్పారు. ఇంతవరకు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోని అభ్యర్థులు వెంటనే http://cse.ap.gov.on వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు గుర్తింపు కార్డు (ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు కార్డు) తీసుకెళ్లాలన్నారు. దివ్యాంగ అభ్యర్థుల కోసం జిల్లా విద్యాశాఖ సహాయకుడిని కేటాయించిందన్నారు. అభ్యర్థి ఒకటి కంటే ఎక్కువ హాల్ టిక్కెట్లు ఉంటే ఏదో ఒక పరీక్ష కేంద్రంలో మాత్రమే పరీక్షకు హాజరుకావాలని స్పష్టం చేశారు.

ఖరీఫ్‌లో 222 పంట కోత ప్రయోగాలు

చిత్తూరు (వ్యవసాయం): జిల్లాలో ఖరీఫ్‌లో సాగైన పలు రకాల పంటల దిగుబడుల అంచనాకు 222 పంట కోత ప్రయోగాలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. వరి పంటలో 34, రాగిలో 20, మొక్కజొన్నలో 16, కందిలో 18, ఉలవలో 16, వేరుసెనగ 72, చెరకు 46 పంట కోత ప్రయోగాలు చేపట్టాలని నిర్ణయించినట్లు వివరించారు. ఇప్పటికే వేరుసెనగ సాగులో పంట కోత ప్రయోగాలు ప్రారంభించామని చెప్పారు. శాస్త్రీయ పద్ధతిలో పంట కోత ప్రయోగాలు నిర్వహించి.. కచ్చితమైన పంట దిగుబడుల వివరాలు సమర్పించాలని ఏవోలకు సూచించారు. తప్పిదాలకు పాల్పడితే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మొదటి రోజు బోణీ కాలేదు

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: ప్రైవేటు మద్యం దుకాణం విధానం అమలులో మొదటి రోజు ఒక్క దరఖాస్తు కూడా అందలేదు. ప్రైవేటు మద్యం విధానాన్ని ప్రభుత్వం ఖరారు చేసి.. సోమవారం అర్ధరాత్రి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఔత్సాహికుల సౌకర్యార్థం ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తుల స్వీకరణ ఉండడంతో అన్ని ఎక్సైజ్ స్టేషన్లలో ఏర్పాట్లు చేశారు.

తొలి రోజే 98.3 శాతం పింఛన్ల పంపిణీ

2,65,092 మందికి రూ.111.83 కోట్ల అందజేత

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: పింఛన్ల పంపిణీ శరవేగంగా సాగింది. ఒకటో తేదీ మంగళవారం ఉదయం 6 గంటల నుంచే సామాజిక పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. మొదటి రోజు రాత్రి 8 గంటల సమయానికి మొత్తం 98.3 శాతం పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. జిల్లాలో మొత్తం 2,69,677 మందికి రూ.113.77 కోట్లు మంజూరు కాగా, అందులో మొదటి రోజు 2,65,092 మందికి రూ.111.83 కోట్లు పంపిణీ చేశారు.

ఆలోచన సంధించి.. విజయం సాధించి

కుప్పం విద్యార్థుల నూతన ఆవిష్కరణ

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: అధునాతన ప్రపంచంలో అన్నింటా పోటా పోటీలు పెరిగిపోయాయి.. తమలోని ప్రతిభను వెలికి తీసి ప్రపంచానికి చూపితేనే తమ సామర్థ్యానికి గుర్తింపు ఉంటుంది. ఆ సామర్థ్యం వెలికి తీయకుంటే పోటీ ప్రపంచంలో నెట్టుకురావడం కష్టం. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ చివరి సంవత్సరం విద్యార్థులు నూతన ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. సోలారును ఉపయోగించి రాత్రిపూట చిన్నపాటి కాంతిని ద్వారా విద్యుత్తును భద్రపరిచే ప్రయోగం.. రోబో ఆధారిత వ్యవసాయం.. వైర్‌లెస్ రన్‌టైమ్ ఎలక్ట్రిక్ వాహనం ఇలా అనే పరికరాలను తయారు చేసి అందరి చేత శభాష్ అనిపించుకుంటున్నారు.



పోర్టబుల్ మల్టీ స్టేజ్ సోలార్ పవర్ ఎనర్జీ కన్వర్షన్ రీ-స్టోరేజ్ సిస్టంతో విద్యార్థులు..

ప్రయోగం: పోర్టబుల్ మల్టీ స్టేజ్ సోలార్ పవర్ ఎనర్జీ

ప్రయోజనం: విద్యుత్తు ఉత్పత్తిలో ఖర్చు తగ్గించడం

విద్యార్థులు: ఇందు, హరీష్, ప్రవీణ్, సాయిస్వప్న, మహేష్‌బాబు

ఈ ప్రాజెక్టు మొబైల్ ఫొటో వోల్టాయిక్ (పీవీ)లో కొత్త విధానాన్ని కేంద్రీకరిస్తుందని విద్యార్థులు ఇందు, హరీష్, ప్రవీణ్, సాయిస్వప్న, మహేష్‌బాబు వివరించారు. విద్యుత్తు ఉత్పత్తి ఖర్చు, సమర్థత, సామర్థ్యం, స్థిరత్వం, సౌర ఫలకాలు (సోలారు ప్యానల్) కోసం ట్రాకింగ్ వ్యవస్థలు సాధారణంగా ఖరీదైన గైరోను ఉపయోగిస్తాయన్నారు. తాము తయారు చేసిన ప్రయోగం ద్వారా సూర్యుడి కదలికను ట్రాక్ చేసి, లైట్ డిపెండెంట్ రెసిస్టర్ల ద్వారా విద్యుత్తు శక్తిని తయారు చేస్తుందన్నారు. ప్రత్యేక ప్యానళ్లను ఏర్పాటు చేయడం వల్ల రాత్రివేళ వచ్చే చిన్న కాంతి ద్వారా విద్యుత్తును తయారు చేయవచ్చన్నారు.

ప్రయోగం: ఇంటెలిజెన్స్ రోబో అగ్రికల్చర్ మోనిటరింగ్ అండ్ కంట్రోలింగ్..

ప్రయోజనం: వ్యవసాయ పద్ధతుల్లో సత్ఫలితాలు

విద్యార్థులు: బాలు, జైవంత్, రవికుమార్, అన్వర్‌బాషా, ఉపేంద్ర, భవ్య

వ్యవసాయ పద్ధతుల్లో సత్ఫలితాలు సాధించేందుకు ఇంటెలిజెన్స్ రోబో అగ్రికల్చర్ మోనిటరింగ్ అండ్ కంట్రోలింగ్ సిస్టమ్‌ను తయారు చేసినట్లు విద్యార్థులు టి.బాలు, జైవంత్, రవికుమార్, అన్వర్ బాషా, ఉపేంద్ర, భవ్య వివరించారు. వ్యవసాయాన్ని ఎద్దులు, ట్రాక్టర్లు, టిల్లర్ల వంటి యంత్రాల సాయంతో చేస్తున్నారు. ఆధునిక కాలంలో వ్యవసాయానికి కూలీలు లభించడం సవాళ్లుగా మారింది. ఈ పనులు సులభతరం చేయడానికి రోబోటిక్ ప్లాట్‌ఫారంను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు.



ఇంటెలిజెన్స్ రోబో అగ్రికల్చర్ మానిటరింగ్ అండ్ కంట్రోలింగ్‌తో విద్యార్థులు



వైర్‌లెస్ రన్‌టైమ్ ఎలక్ట్రిక్ వెహికల్ సిస్టం బై యూజింగ్ రెన్యుబుల్ ఎనర్జీ సోర్స్ పరికరంతో విద్యార్థులు

ప్రయోగం: వైర్‌లెస్ రన్‌టైమ్ ఎలక్ట్రిక్ వెహికల్ సిస్టం బై యూజింగ్ రెన్యుబుల్ ఎనర్జీ సోర్స్

ప్రయోజనం: సౌరశక్తిని వినియోగించి ఈవీ వాహనాల ప్రయాణం

విద్యార్థులు: సాయి, లలిత కిషోర్, రెడ్డి ప్రసాద్, సౌమ్య, అంజనీకుమార్

సోలార్ ద్వారా ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీలు)కు ఛార్జింగ్ చేయడం కోసం ప్రయోగాన్ని తయారు చేసినట్లు విద్యార్థులు సాయి, లలిత కిషోర్, రెడ్డిప్రసాద్, సౌమ్య, అంజనీ కుమార్ వివరించారు. సౌరశక్తిని ఉపయోగించడం వల్ల స్థిరమైన ఛార్జింగ్ స్టేషన్ల అవసరాన్ని తొలగిస్తుందన్నారు. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించడం, పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడం జరుగుతుందన్నారు. దీంతో ఈవీ వాహనాలకు ఛార్జింగ్ కోసం ఛార్జింగ్ స్టేషన్లకు వెళ్లకుండా వాహనాలు నడిపే సమయంలో ఛార్జింగ్ అయ్యేలా తయారు చేసినట్లు వివరించారు.

దసరా, దీపావళికి ప్రత్యేక రైళ్లు

తిరుపతి (రైల్వే), న్యూస్‌టుడే: దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు తిరుపతి స్టేషన్ మేనేజర్ చిన్నప్పరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి- కాచిగూడ (07064) రైలు అక్టోబరు 2, 9, 16, 23, 30న, నవంబరు 6, 13న.. 07654 రైలు అక్టోబరు 11, 18, 25న నవంబరులో 1, 8, 15వ తేదీల్లో.. తిరుపతి- సికింద్రాబాద్ (07042) రైలు అక్టోబరులో 3, 5, 10, 12, 17, 19, 24, 26, 31న, నవంబరు 2, 7, 9, 14, 16న.. 07490 రైలు అక్టోబరు 8, 15, 22, 29న, నవంబరు 5, 12, 19, 26న.. 07481 రైలు అక్టోబరు 13, 20, 27న.. నవంబరు 3, 10, 17, 24న.. తిరుపతి- విశాఖపట్నం (08584) రైలు అక్టోబరు 8, 15, 22, 29న, నవంబరు 5, 12, 19, 26న.. తిరుపతి- షిరిడీ (07637), తిరుపతి- మచిలీపట్నం (07121) రైళ్లు అక్టోబరు 6, 13, 20, 27న నవంబరు 3, 10, 17, 24వ తేదీల్లో.. తిరుపతి- శ్రీకాకుళం (07442) రైలు అక్టోబరు 6, 13, 20, 27న, నవంబరు 3, 10న నడవనున్నాయి.

వృద్ధాప్యంలో ఆరోగ్యంగా ఉండండి

చిత్తూరు (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: వృద్ధులు నడక, యోగా తదితర వ్యాయామాలు క్రమంగా చేస్తూ ఆరోగ్యంగా ఉండాలని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి తెలిపారు. చిత్తూరు నగరం టెలిఫోన్ కాలనీ అర్బన్ ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి మాట్లాడారు. అనారోగ్య సమస్యలు వస్తుంటాయని, వాటిని ప్రారంభ దశలోనే గుర్తించి, చికిత్సలు పొందాలన్నారు. 60 ఏళ్లు పైబడిన వారికి బీసీజీ టీకాలు అందిస్తున్నామని, ప్రతి ఒక్కరూ వాటిని వేయించుకోవాలని చెప్పారు. వైద్యులు శిరీష, ప్రశాంతి, శ్రీవాణి పాల్గొన్నారు.

తితిదే సొంతంగా డెయిరీని ఏర్పాటు చేయాలి



పాదయాత్రగా తిరుమల చేరుకుంటున్న రామచంద్రయాదవ్

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ప్రసాదాలు, లడ్డూలను తయారు చేసేందుకు అవసరమైన నెయ్యిని సొంతంగా తయారు చేసుకునేందుకు తితిదే సొంత డెయిరీని ఏర్పాటు చేయాలని బీసీవైఎం పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. పుంగనూరు నుంచి తిరుమల పరిరక్షణ పాదయాత్ర చేపట్టిన ఆయన నాలుగురోజుల అనంతరం మంగళవారం తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. అంతకు ముందు ఎస్వీ గోశాల వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమలలో రోజుకొక వివాదం చోటుచేసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. తితిదే సొంతంగా డెయిరీని ఏర్పాటు చేస్తే తాను వెయ్యి ఆవులను విరాళంగా ఇస్తానని, దాతల సహకారంతో మరో లక్ష ఆవులను ఇప్పించే బాధ్యత తీసుకుంటానన్నారు. తద్వారా పెద్దఎత్తున పాలు, నెయ్యి తితిదేకు అందుబాటులోకి వస్తుందని, వెయ్యిమంది గోపాలురకు ఉపాధి లభిస్తుందన్నారు. చిత్తూరు డెయిరీని తితిదే పరిధిలోకి తీసుకురావాలని 2019లో తితిదే పాలకమండలి తీర్మానించగా చివరకు అమూల్‌కు కేటాయించారని ఆయన విమర్శించారు. సీఎం చంద్రబాబు హయాంలో ఈ కార్యక్రమాన్ని చేపడితే చరిత్రలో నిలిచిపోతారని చెప్పారు.

ఎర్రచందనం గ్లోబల్ టెండర్లకు సన్నాహాలు



ఎర్రచందనం తూకం వివరాలు నమోదు చేస్తున్న పీసీసీఎఫ్ సుమన్

మంగళం (తిరుపతి), న్యూస్‌టుడే: ఎర్రచందనం విక్రయాల్లో భాగంగా 20వ గ్లోబల్ టెండర్లకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. త్వరలో 900 టన్నులకు వేలం నిర్వహించే అవకాశం ఉంది. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) ఆర్.కె.సుమన్ నేతృత్వంలోని ధరల నిర్ణయ కమిటీ మంగళవారం తిరుపతిలోని కేంద్రీయ ఎర్ర చందనం గోదాములను సందర్శించింది. 50 లాట్లలో నిల్వ చేసిన దుంగల గ్రేడ్లను పరిశీలించడం తోపాటు వాటి రంగును నమోదు చేశారు. గతంలో ఉన్న ధరలను సవరించిన అనంతరం గ్లోబల్ టెండర్లకు వెళ్లే అవకాశం ఉంది. గతంలో ఎ-గ్రేడు రూ.65-75 లక్షలు, బి-గ్రేడు రూ.30-35 లక్షలు, సి-గ్రేడు రూ.20 లక్షలు ఉంది. కమిటీలో తిరుపతి సీసీఎఫ్ నాగేశ్వరరావు, ఇన్‌ఛార్జి జిల్లా అటవీశాఖ అధికారి సెల్వం, స్టేట్ సిల్వికల్చరిస్ట్ యశోదాబాయి, కేంద్రీయ ఎర్రచందనం గోదాముల డీఎఫ్‌వో ఎస్.ఎన్.శివకుమార్ ఉన్నారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	111
రిటైల్	133
లేయర్	115
బ్రాయిలర్స్	193
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	219
లేయర్ మాంసం	195



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

సదుం, న్యూస్‌టుడే: మహాత్మా జ్యోతిబా పులే గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి మంగళవారం తెలిపారు. తిరుపతిలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 కబడ్డీ పోటీల్లో బాలాజీ, హర్షవర్ధన్ ప్రతిభ కనబరచినట్లు చెప్పారు. నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

నేడు ఉపకార వేతనాల పంపిణీ

పూతలపట్టు, న్యూస్‌టుడే: పేటమిట్టలోని మంగళం విద్యాలయంలో శ్రీకృష్ణదేవరాయ విద్యా సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు ఆ సంఘం కార్యదర్శి గల్లా విజయనాయుడు మంగళవారం తెలిపారు. సంఘం 49వ వార్షికోత్సవాన్ని జరుపుతూ గ్రామీణ ప్రాంతాల్లోని 200 మంది విద్యార్థులకు రూ.40 లక్షల ఉపకార వేతనాలు అందజేయనున్నట్లు చెప్పారు. అమరరాజ సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ గల్లా రామచంద్రనాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, ఈ సంఘం అధ్యక్షురాలు రమాదేవి గౌరినేని, విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీనివాసరాజు, బెంగళూరు పీఈఎస్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జవహర్ దొరస్వామి పాల్గొంటారని పేర్కొన్నారు.



ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావుకు సమస్యలు విన్నవిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

విద్యుత్తు సమస్యలపై సీఎండీకి ఎమ్మెల్యే వినతి

పుత్తూరు, న్యూస్‌టుడే: నగరి నియోజకవర్గంలో విద్యుత్తు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావును ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కోరారు. మంగళవారం తిరుపతిలో విద్యుత్తు శాఖ కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయాలన్నారు. నియంత్రికలు కాలిపోయినా, మరమ్మతులకు గురైన వెంటనే బాగు చేయించాలని, రైతులపై భారం మోపవద్దని పేర్కొన్నారు. అవసరమైన చోట 33/11 కేవీ విద్యుత్తు ఉపకేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. సీఎండీ సానుకూలంగా స్పందించి కొత్త ఉపకేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

గణనాథుడి హుండీ ఆదాయం రూ.2.15 కోట్లు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకల ద్వారా గడచిన 27 రోజుల్లో 2,15,30,322 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో పి.గురుప్రసాద్ తెలిపారు. ఆలయ ఆస్థాన మండపంలో కానుకలను మంగళవారం లెక్కించారు. 90 గ్రాముల బంగారం, 1.295 కిలోల వెండి వచ్చినట్లు తెలిపారు. 947 యూఎస్‌ఏ, 110 కెనడా డాలర్లు, 406 మలేషియా రింగిట్స్, 129 యూఏఈ దిరామ్స్, 150 యూరోలతో పాటు పలు విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఈవో వివరించారు. నిత్యాన్నదాన హుండీలో రూ.44,159, గోసంరక్షణ రూ.29,513, స్వామివారి భిక్షాండి రూ.18,212 ఆదాయం వచ్చిందన్నారు. లెక్కింపులో ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, సీఎఫ్‌వో నాగేశ్వరరావు, అధికారులు, స్థానిక యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బోయకొండ హుండీ ఆదాయం రూ.51.57 లక్షలు

బోయకొండ (చౌడేపల్లె), న్యూస్‌టుడే: బోయకొండ ఆలయానికి హుండీ ద్వారా రూ.51.57లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో ఏకాంబరం తెలిపారు. 57 రోజుల పాటు భక్తులు అమ్మవారికి హుండీ ద్వారా చెల్లించిన కానుకలను మంగళవారం ఆలయ ఆవరణలో లెక్కించారు. ఇందులో రూ.51,57,968 నగదు, 61 గ్రాముల బంగారం, 450 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీ కూడా వచ్చినట్లు చెప్పారు. అలాగే కొండపై ఉపాలయంగా ఉన్న రణబేరి గంగమ్మ ఆలయ హుండీ ద్వారా రూ.35,502 సమకూరినట్లు ఈవో వివరించారు.

రెస్కో మాజీ ఎండీకి 41ఏ నోటీసు

కుప్పం పట్టణం : కుప్పం గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ(రెస్కో) పరిధిలో గత ఐదేళ్లలో జరిగిన అవినీతిపై నమోదైన కేసుల్లో మాజీ రెస్కో ఎండీ సుబ్రహ్మణ్యంను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం విదితమే. మంగళవారం 41ఏ నోటీసులు ఇచ్చి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. రెస్కోలో డీజిల్ వినియోగంలో అవకతవకలు, అక్రమంగా పదోన్నతులపై ప్రస్తుత ఎండీ సోమశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుప్పం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుల్లో ఏ2గా మాజీ ఎండీ సుబ్రహ్మణ్యం ఉన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న డీజీపీ

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని డీజీపీ ద్వారకా తిరుమలరావు మంగళవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు తితిదే అధికారులు స్వాగతం పలికి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. వీరితోపాటు తిరుపతి ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, తితిదే సీవీఎస్‌వో శ్రీధర్, ఏవీఎస్‌వోలు గిరిధర్, మనోహర్, డీఎస్పీ విజయ్‌శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీజీపీ తిరుమలలోని బాలాజీ బస్టాండ్‌ను పరిశీలించారు. ఆర్టీసీ డీఎంతో మాట్లాడి వెనుదిరిగారు. శ్రీవారిని ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఎన్‌సీసీ లెఫ్టినెంట్ జనరల్ గుర్‌బీర్‌పాల్ సింగ్, అనంతపురం రేంజీ డీఐజీ డాక్టర్ షేముషి దర్శించుకున్నారు.

చురుగ్గా బిందు సేద్యం పథకం అమలు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లాలో బిందు, తుంపర్ల సేద్యం పథకం జోరందుకుంది. గత అయిదేళ్ల వైకాపా పాలనలో పాలకుల నిర్లక్ష్యంతో పథకం నిర్వీర్యమైంది. రైతులకు రాయితీ బిందు సేద్యం పరికరాల పంపిణీ ఊసే లేదు. ఐదేళ్ల పాటు పరికరాలు అందక అన్నదాతలు పాట్లు పడ్డారు. రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన కూటమి ప్రభుత్వం ఆగిపోయిన సూక్ష్మ నీటిసాగు పథకం అమలుకు ప్రత్యేక దృష్టి సారించింది. అర్హులైన రైతులందరికీ బిందు సేద్యం రాయితీలు అందజేసి సేద్యం విస్తరణకు చర్యలు చేపట్టింది. కలెక్టర్ సుమితకుమార్ ఆదేశాల మేరకు జిల్లాలో రాయితీల మంజూరుకు రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రణాళికబద్ధంగా నిర్వహించామని సూక్ష్మనీటిసాగు పథకం పీడీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 25,500 హెక్టార్లకు బిందు సేద్యం రాయితీల కోసం 25,021 మంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. ఇప్పటి వరకు సుమారు 6 వేల హెక్టార్లలో క్షేత్రస్థాయి పరిశీలన పూర్తిచేసి..వ్యయ అంచనాల వివరాలను లబ్ధిదారుల చరవాణులకు సంక్షిప్త సందేశాలుగా పంపామన్నారు. రాయితీ పోను రైతు వాటా నగదు డీడీ రూపంలో చెల్లించిన రైతులకు నిర్దేశిత రోజుల్లో బిందు సేద్యం పరికరాల సరఫరా, అమర్చడం పూర్తి చేస్తామన్నారు.

మద్యం దుకాణాలకు టెండర్ల ప్రకటన విడుదల

- 9వ తేదీ వరకు దరఖాస్తు గడువు
- 11న లాటరీలో 104 దుకాణాల కేటాయింపు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: నూతన మద్యం విధానం అమలు నేపథ్యంలో జిల్లాలోని 104 మద్యం దుకాణాలకు 2024-26 కాలపరిమితితో లైసెన్సుల జారీకి సంబంధించి నోటిఫికేషన్‌ను కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం విడుదల చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 'జిల్లాలోని 8 ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాల్లో ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుల్ని స్వీకరిస్తాం. దరఖాస్తుదారుడు రూ.2 లక్షలు నాన్ రీఫండబుల్ రూపంలో రుసుం చెల్లించాలి. చిత్తూరు అర్బన్ సర్కిల్‌లో 22 దుకాణాలు, చిత్తూరు రూరల్ 19, కార్వేటినగరం 8, నగరి 11, పుంగనూరు 14, పలమనేరు 13, కుప్పం 10, పులిచెర్ల సర్కిల్‌లో 7 దుకాణాలకు లైసెన్సులు జారీచేస్తాం. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. 11వ తేదీన ఉదయం 8 గంటలకు చిత్తూరు నగరంలోని సహకార చక్కెర కర్మాగార కల్యాణ మండపం (దొడ్డిపల్లె)లో లాటరీ ద్వారా డ్రా తీసి.. దుకాణాల్ని కేటాయిస్తాం. 12వ తేదీ నుంచి లైసెన్సుదారులు కొత్త దుకాణాల్ని ప్రారంభించుకోవచ్చు. రెండో ఏడాది దుకాణ లైసెన్సు రుసుములపై 10 శాతం పెంచి వసూలు చేస్తారని' పేర్కొన్నారు. ఎక్సైజ్‌శాఖ డీసీ విజయ్‌కుమార్, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



నోటిఫికేషన్ విడుదల చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎక్సైజ్ డీసీ విజయ్‌కుమార్

* రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు-రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అధిక శాతం భూసమస్యలు కుటుంబ సభ్యుల మధ్యనే ఉన్నాయని.. రీసర్వే, డీకేటీ పట్టాలు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. * రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలో ప్రత్యేక సంక్షిప్త ఓటరు సవరణ జాబితా ప్రక్రియపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫారం-6 దరఖాస్తులు 3,766, ఫారం-7 దరఖాస్తులు 9,913, ఫారం-8 దరఖాస్తులు 16,642 పెండింగ్‌లో ఉందన్నారు.

పాకశాస్త్ర కళాశాలలో వేడుకలు

రేణిగుంట, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా స్థానిక పాకశాస్త్ర కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాత పరీక్షలను నిర్వహించారు. అనంతరం కళాశాలలో ఓనమ్ వేడుకలు జరిపారు. తిరుపతి ఐఐటీ, ఐసెర్ కేంద్రాలకు చెందిన విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల హెడ్ త్రిలోకచంద్ర తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న దృశ్యం

హోరాహోరీగా క్రికెట్ పోటీలు



సహస్రరెడ్డి (72 పరుగులు)



సృజన (51 పరుగులు)

వెంకటగిరి, న్యూస్‌టుడే: ఆంధ్రా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అండర్-15 మహిళా క్రికెట్ పోటీలు నందమూరి తారక రామారావు క్రీడా మైదానంలో హోరాహోరీగా సాగుతున్నాయి. గ్రౌండ్ 'ఎ'లో టాస్ గెలిచిన టీమ్ 'డి' జట్టు బ్యాటింగ్ చేపట్టి 6 వికెట్లు నష్టపోయి 208 పరుగులు సాధించింది. జట్టులో ధన్యశ్రీ 60 పరుగులు చేసింది. టీమ్ 'ఎ' తరఫున బౌలింగ్‌లో వర్ష, సాయివర్షిక రెండేసి వికెట్లు తీశారు. తరువాత బరిలో దిగిన టీమ్ 'ఎ' జట్టు 6 వికెట్లు నష్టానికి 209 పరుగులు సాధించింది. జట్టులో పుష్పిత 93 పరుగులు చేసింది. టీమ్ 'డి' జట్టు తరఫున బౌలింగ్ చేసిన మేఘన, నేహా రెండేసి వికెట్లు తీశారు. టీమ్ 'ఎ' జట్టు 4 వికెట్లు తేడాతో విజయం సాధించింది. గ్రౌండ్ 'బి'లో బ్యాటింగ్ చేపట్టిన టీమ్ 'సి' 133 పరుగులకే ఆలౌట్ అయ్యింది. జట్టులో దీక్షిక 68 పరుగులు చేసింది. టీమ్ 'బి' జట్టులో బౌలింగ్ చేపట్టిన బెహారా, సహస్ర మూడేసి వికెట్లు తీశారు. బరిలో దిగిన టీమ్ 'బి' జట్టు వికెట్ నష్టపోయి 137 పరుగులు చేసింది. సహస్రరెడ్డి 72, సృజన 51 పరుగులు చేశారు. టీమ్ 'బి' 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

గరుడ సేవకు విచ్చేసే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 8న జరిగే గరుడసేవకు లక్షలాదిగా విచ్చేసే భక్తులకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలని తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. స్థానిక గోకులం విశ్రాంతి భవనంలో మంగళవారం ఆయన సమీక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాల వీడియోలను పరిశీలించి సంబంధిత అధికారులకు ప్రత్యేకంగా సూచనలు చేశారు. గ్యాలరీల్లో అన్నప్రసాదం పంపిణీ విధానాలను పరిశీలించి ఇతర విభాగాలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. రవాణాశాఖ జీఎం శేషారెడ్డి, డిప్యూటీ ఈవోలు రాజేంద్ర, ఆశాజ్యోతి, హెచ్‌డీపీపీ, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

98 శాతం పింఛన్ల పంపిణీ

బంగారుపాళ్యం: మండలంలో ఎన్టీఆర్ భరోసా పథకంలో 98శాతం మందికి పింఛన్ల పంపిణీ చేసినట్లు ఎంపీడీవో శివశంకర్ మంగళవారం తెలిపారు. మండలంలోని తగ్గువారిపల్లెలో తెదేపా మండల అధ్యక్షులు జయప్రకాష్‌నాయుడు వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జనార్దన్, ఉపాధ్యక్షులు లోకనాథనాయుడు, నాయకులు హేమచంద్ర, శివ, గ్రామకార్యదర్శి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు

నింద్ర: కైలాసం గ్రామానికి వెళ్లే మార్గంలో తారు రోడ్డు వద్ద నుంచి దళితవాడ వెళ్లే మార్గంలో ఉపాధి నిధులు రూ.11 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు సోమవారం ప్రారంభించారు.

నేడు మాంసం దుకాణాలు తెరవరాదు

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా నగరంలో బుధవారం మాంసం దుకాణాలు తెరవరాదని నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. దుకాణాలు తెరిస్తే.. లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 80085 74683
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 80085 74601

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే:
సమస్య: స్థానిక మసీదు మిట్టలో శునకాల బెడద ఎక్కువగా ఉంటుంది. పిల్లలపై శునకాలు దాడి చేస్తున్నాయి.
- స్థానికులు
సమాధానం: వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
-అనిల్ కుమార్, నగరపాలక ఆరోగ్యాధికారి

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



తెదేపాలో చేరుతున్న ఆరిమాను గంగమ్మ ఆలయ ఛైర్మన్ లింగారెడ్డి

కార్వేటినగరం,జీడీనెల్లూరు, న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే థామస్ అన్నారు. మండలంలోని పాదిరికుప్పంలో పింఛన్ల పంపిణీని ఆయన ప్రారంభించారు. జీడీనెల్లూరు మండలం నెల్లేపల్లె పంచాయతీ పరిధి గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. జనసేన నియోజకవర్గ బాధ్యుడు యుగంధర్, తెదేపా నాయకులు చెంగల్రాయులుయాదవ్, రాజేంద్రరెడ్డి, నాగేశ్వరరాజు, దామోధరం పాల్గొన్నారు. **శ్రీరంగరాజపురం:** ఆరిమాను గంగమ్మ ఆలయ ఛైర్మన్, వైకాపానేత లింగారెడ్డి మంగళవారం ఎమ్మెల్యే థామస్ సమక్షంలో తెదేపాలో చేరారు.

తెదేపా హయాంలో సంక్షేమ రంగానికి ప్రాధాన్యం



పింఛను నగదు అందిస్తున్న గంజి మాధవయ్య

పుత్తూరు,న్యూస్‌టుడే: తెదేపా హయాంలో సంక్షేమ రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నారని పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. మజ్జిగగుంటలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొని మాట్లాడారు. పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు 22వ వార్డులో పెన్షన్లు పంపిణీ చేశారు. **నగరి:** గంజి మాధవయ్యను నగరి తెదేపా నాయకులు మంగళవారం కలసి ఘనంగా సన్మానించారు. టీఎన్‌టీయూసీ జిల్లా అధికార ప్రతినిధి జ్యోతినాయుడు, కృష్ణారెడ్డి, గుణశేఖర్, చంద్రశేఖర్, రాజా, సలీం, శ్రీధర్, మణి ఉన్నారు.

ఆక్రమిత స్థలాన్ని పరిశీలించిన అధికారులు.. పెనుమూరు: మండలంలోని విడిదిపల్లెలో ఆక్రమణకు గురైన శ్మశాన స్థలాన్ని రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు. సోమవారం గ్రామస్థులు తహసీల్దారు శ్రావణ్‌కుమార్‌కు ఆక్రమణపై వినతి చేసిన విషయం తెలిసిందే. స్పందించిన తహసీల్దారు ఆదేశాలతో ఆర్ఐ అమినాబీ, సర్వేయర్ డిల్లీబాబు, వీఆర్వో నాగరాజు స్థలాన్ని పరిశీలించారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు.. చిత్తూరు(క్రీడలు): నగరంలోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో ఈనెల 2 నుంచి 5 వరకు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. నవరాత్రి మహోత్సవాలు 4వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయి. స్వామివారు.. 4న మత్స్యావతారం, 5న కూర్మావతారం, 6న వరహావతారం, 7న నరసింహావతారం, 8న వామనావతారం, 9న పరశురామావతారం, 10న రామావతారం, 11న బలరామావతారం, 12న కృష్ణావతారంలో దర్శనమివ్వనున్నట్లు ప్రధాన అర్చకులు వేణుగోపాల్ తెలిపారు.

శిరస్త్రాణ వినియోగం తప్పనిసరి.. చిత్తూరు విద్య: వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన డీఈవో దేవరాజుతో కలిసి ఉద్యోగులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఉద్యోగులు హెల్మెట్ వినియోగించి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సౌలభ్యానికే విద్యావాణి.. బంగారుపాళ్యం: విద్యార్థులు చదువుల్లో సులభంగా రాణించేందుకే మంగళ విద్యావాణి సంచికను ప్రచురించి విద్యార్థులకు అందచేస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 29వ సంచికను ఆవిష్కరించారు. తిరుపతికి చెందిన విశ్రాంతి ఉపాధ్యాయులు సుధాకర్‌పిళ్లై భార్య గీతాంజలి జ్ఞాపకార్థంగా, బుషేంద్రరెడ్డి సంచిక ముద్రణకు తగిన పైకం విరాళంగా అందించారని తెలిపారు.

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు.. చిత్తూరు నగరం: స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక రామ్‌నగర్‌కాలనీలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మంగళవారం దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దంత వైద్యులు విష్ణుకుమార్, సుష్మ దంత సంరక్షణపై అవగాహన కల్పించారు.

రవిని కలిసిన రమేష్.. నింద్ర: అగరం గ్రామానికి చెందిన మాజీ జిల్లా తెలుగు యువత కార్యదర్శి రమేష్ క్రీడా సాధికారిక సంస్థ ఛైర్మన్ రవి ఎంపికైన తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలోని పేరేడ్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో సోమవారం కలిసినట్లు తెలిపారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి.. పెనుమూరు: మండలంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పథకం కింద పనులను గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో ప్రణాళిక తయారీపై ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

అక్రమాలకు చిరునామా.. ప్రజారోగ్య విభాగం

☛ ట్రేడ్ లైసెన్సుల ముసుగులో వసూళ్ల పర్వం
☛ వార్డు కార్యదర్శులు, పీహెచ్ మేస్త్రీల దందా

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: వాణిజ్య దుకాణాలు, కర్మాగారాలకు నగరపాలక సంస్థ జారీ చేసే డేంజరస్ అండ్ అఫెన్సివ్ (డీ అండ్ వో) ట్రేడ్ లైసెన్సు ఫీజుల వసూళ్లలో అక్రమాలు నిరాటంకంగా సాగుతున్నాయి. నగరంలో వేల సంఖ్యలో ఉన్న దుకాణాల నుంచి అనధికారికంగా లైసెన్సు ఫీజుల్ని వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు పెచ్చుమీరాయి. పలువురు ఫిర్యాదులు చేస్తున్నా.. అధికారులు బయటకు పొక్కనీయకుండా తొక్కిపెడుతున్నారనే విమర్శలున్నాయి.



నగరపాలక కార్యాలయం

ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా వసూళ్లు

ప్రమాదకరమైన, అప్రియమైన పదార్థాల తయారీ యంత్రాలతో కూడిన పారిశ్రామిక, వాణిజ్య వ్యాపారాన్ని ప్రారంభించే ప్రతి ఒక్కరూ నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం నుంచి డీ అండ్ వో ట్రేడ్ లైసెన్సును పొందాల్సి ఉంటుంది. ఏటా లైసెన్సుదారులు నిర్ణీత ఫీజు చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలి. నగరపాలక పరిధిలో ప్రస్తుతం 3వేలకు పైగా వాణిజ్య దుకాణాలకు ట్రేడ్ లైసెన్సులు ఇచ్చారు. అప్‌డేట్ చేస్తే ఈ సంఖ్య నాలుగు వేల వరకు పెరిగే అవకాశం ఉంది. దుకాణాల నుంచి రూ.2 కోట్ల వరకు వసూలు చేయాల్సి ఉంటుంది. ఫీజుల వసూళ్లలో అక్రమాలను అరికట్టడానికి 2018లో తెదేపా ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఇందులో కొంత వరకే ట్రేడ్ లైసెన్సుదారుల వివరాలు ఎక్కించారు. మిగిలిన వారి నుంచి అనధికారికంగా వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

❖ స్థానిక చర్చివీధిలో ఒకరు దుస్తుల దుకాణ ట్రేడ్ లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈయన నుంచి కొంత నగదును వసూలు చేసుకుని ఇప్పటివరకు సంబంధిత లైసెన్సును జారీ చేయకుండా ప్రజారోగ్య విభాగం సిబ్బంది కాలయాపన చేస్తున్నారు. దీనిపై పలుమార్లు సిబ్బందిని ప్రశ్నించినా.. ఫలితం లేదని సదరు వ్యాపారి వాపోయారు. అనుమతి లేకుండా వ్యాపారం నిర్వహిస్తే తనిఖీల సమయంలో ఇబ్బంది వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

దందాలో వీరే కీలకం

రెన్యూవల్ చేసుకునే సమయం వచ్చిందంటే.. ట్రేడ్ లైసెన్సుల పేరుతో పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు దుకాణదారుల నుంచి డబ్బులు వసూలు చేసుకుని రసీదులు ఇవ్వకుండా జారుకుంటున్నారు. ఇక చేసేదేమీ లేక దుకాణదారులు మిన్నకుండిపోతున్నారు. ప్రజారోగ్య సిబ్బంది రసీదు రాయని కారణంగా ఆన్‌లైన్‌లో రెన్యూవల్ ఫీజుల చెల్లింపు వివరాలు పొందుపరచడం లేదు. దీంతో సహజంగా దుకాణదారుల లైసెన్సులు రద్దవుతాయి. దీనిపై గట్టిగా నిలదీసిన వారికి కొత్తగా ట్రేడ్ లైసెన్సులను విధించి ఆర్థికంగా భారాన్ని మోపుతున్నారు. ఈ తరహా అక్రమాల కారణంగా లైసెన్సుదారులు చాలా మంది రెన్యూవల్ ఫీజు బకాయిదారులుగా ఉండిపోతున్నారు.

ఆదాయానికి గండి

ఫీజులు చెల్లించకుండా అందులో కొంత ఇస్తే చాలు అన్నట్లు వీరి వ్యవహారం ఉంటుంది. ఫలితంగా నగరపాలక సంస్థ ఆదాయానికి గండి పడుతోంది. ట్రేడ్ లైసెన్సుదారుల్లో ఎక్కువ మంది ఇలా మోసపోతున్నారు. ఇలా వసూలు చేసిన మొత్తంలో ఆ విభాగంలో పైస్థాయి అధికారులకు వాటాలు వెళ్తాయని ఫలితంగా వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తారనే విమర్శలున్నాయి.

చర్యలు చేపడతాం.. ట్రేడ్ లైసెన్సులకు సంబంధించి ఫీజుల వసూళ్ల ప్రక్రియలో అవకతవకలపై విచారణ చేస్తాం. బాధ్యులపై చర్యలు చేపడతాం
-అనిల్ కుమార్, నగరపాలక ఆరోగ్యాధికారి

ఆర్డీవోగా శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ



చిత్తూరు గ్రామీణ: చిత్తూరు రెవెన్యూ డివిజనల్ అధికారిగా శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా తెలుగుగంగ ప్రాజెక్టు ప్రత్యేక డిప్యూటీ కలెక్టరుగా విధులు నిర్వహిస్తూ.. బదిలీపై చిత్తూరు ఆర్డీవోగా వచ్చారు.

డీఈఈగా బాలాజీ..



చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: చిత్తూరు గిరింపేటలోని ఉమ్మడి జిల్లా విద్యుత్తు శాఖ గోదాము డీఈఈగా ఎ.బాలాజీ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

ఆబ్కారీ సీఐ..



శ్రీనివాసులురెడ్డి

నగరి, న్యూస్‌టుడే: ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులురెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన మాధవి బదిలీ కావడంతో, శ్రీసత్యసాయి జిల్లా పెనుగొండ నుంచి నగరికి బదిలీపై శ్రీనివాసులురెడ్డి వచ్చినట్లు తెలిపారు.

అందరికీ ధ్రువీకరణ పత్రాలు

యాదమరి, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజలకు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని తహసీల్దారు పార్థసారధి పేర్కొన్నారు. మంగళవారం డీకే చెరువు గ్రామంలోని ఎస్సీ కాలనీలోని ప్రజలు, పిల్లలకు ఆధార్‌కార్డులు, ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయా, ఉంటే వాటిల్లో వివరాలు సరిగ్గా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ధ్రువీకరణ పత్రాలు ఎలా పొందాలి, వాటి ఉపయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్.ఐ ప్రసాద్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ సంప్రదాయాన్ని మంటగలిపిన జగన్



సమావేశంలో తెదేపా నాయకులు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: అన్యమతస్థులను తితిదేలో అధికారులు, పాలకులుగా నియమించి మాజీ ముఖ్యమంత్రి జగన్ హిందూ సంప్రదాయాన్ని మంట గలిపినట్లు మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు ఆరోపించారు. మంగళవారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తిరుమల లడ్డూ ప్రసాదాన్ని కలుషితం చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసినట్లు పేర్కొన్నారు. సంప్రదాయాన్ని పాటించకుండా జగన్‌రెడ్డి రాజకీయం చేయడం తగదన్నారు. ఈఓ ధర్మారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి లాంటి అన్యమతస్థులు తిరుమల పవిత్రతను దెబ్బతీసినట్లు చెప్పారు. వైవీ సుబ్బారెడ్డి సతీమణి తిరుమలలో చేతిలో బైబిల్‌తో తిరిగిన విషయం అందరికీ తెలుసని స్పష్టం చేశారు. దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సునీల్‌చౌదరి, సప్తగిరిప్రసాద్, మోహన్‌రాజ్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి గొడుగుల ఊరేగింపు



శ్రీవారి పాదుకలు ఊరేగిస్తున్న దృశ్యం

పుత్తూరు, న్యూస్‌టుడే: పట్టణంలో విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో మంగళవారం శ్రీవారి గొడుగులు, పాదుకలు ఊరేగింపు కార్యక్రమం వైభవంగా సాగింది. పట్టణ పరిధిలోని ఆర్టీఎం థియేటర్ వద్ద కన్య పూజ, శ్రీవెంకటేశ్వరస్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భజనలు, బ్యాండు మేళాతాళాల నడుమ ఆర్టీసీ బస్టాండ్, కార్వేటినగరం రోడ్డు, కాపువీధి., బజారువీధి మీదుగా శ్రీవళ్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయం వరకు ఊరేగింపు జరిగింది. అక్కడ ప్రసాద వితరణ చేశారు. అనంతరం వడమాలపేట మీదుగా తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

కొండచిలువ హల్‌చల్



మున్సిపాలిటీలోని ఎన్టీఆర్ కాలనీలోకి వచ్చిన 12 అడుగుల కొండచిలువ

పుత్తూరు,న్యూస్‌టుడే: పుత్తూరు మున్సిపాలిటీలోని ఎన్టీఆర్ కాలనీలో సోమవారం రాత్రి 12 అడుగుల కొండ చిలువ హల్‌చల్ చేసింది. దీంతో కాలని వాసులు స్నేక్‌వాచర్ శ్రీకాంత్‌కు సమాచారం ఇవ్వడంతో వెంటనే అక్కడకు చేరుకుని కొండచిలువను పట్టుకుని అటవీప్రాంతంలో వదిలిపెట్టారు.

పద కవితల వాగ్గేయకారుడు సారంగపాణి



డైట్‌లో సారంగపాణి పద కవితలు ఆలపిస్తున్న సాయికృష్ణ యాచేంద్ర

కార్వేటినగరం, న్యూస్‌టుడే: వేణుగోపాలస్వామిని ఆరాధించిన పరమ భక్తుడు వాగ్గేయకారుడు సారంగపాణి పద కవితలను ప్రపంచానికి చాటి చెప్పాల్సిన బాధ్యత తెలుగువారందరిపై ఉందని సంగీత సాహితీ చంద్ర శ్రీసాయికృష్ణయాచేంద్ర అన్నారు. కార్వేటినగరం డైట్‌లో సంగీత సాహిత్య గేయధార సారంగపాణి పద పరిచయ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ విశ్రాంత వీసీ కుసుమకుమారి, వైణికులుగా ఆదిత్యశర్మ, శోభరాజు వ్యవహరించారు.

మల్బరీ సాగుపై శ్రద్ధ చూపాలి

పెనుమూరు, న్యూస్‌టుడే: రైతులు పట్టు సాగుపై దృష్టి సారించాలని ఆ శాఖ జేడీ శోభారాణి అన్నారు. మంగళవారం మండలంలోని చార్వాకానిపల్లె పంచాయతీలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పట్టు సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని వివరించారు. షెడ్డు నిర్మాణానికి రాయితీ ఇస్తుందని వెల్లడించారు. వ్యవసాయ శాఖ డీడీఏ నాగపద్మిని పశుసంవర్ధకశాఖ ఏడీఏ గీత, పట్టుపరిశ్రమ శాఖ ఏడీఏ మోహన్‌బాబు, ఇన్‌ఛార్జి ఏఈఓ మధురవాణి పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బంగారుపాళ్యం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి చెకుముకి పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి 11 జట్లు, ప్రైవేటు పాఠశాలల నుంచి ఎనిమిది జట్లు పోటీ పడ్డాయి. పోటీల్లో బోడబండ్ల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జయశ్రీ, హేమచంద్ర, సత్య, ప్రైవేటు పాఠశాలకు చెందిన వర్షితరెడ్డి, సంజన, ప్రతిక్‌రెడ్డి మొదటి స్థానం సాధించారు. వీరు ఈ నెల 27న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈవో నాగేశ్వరరావు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు అరుణశివప్రసాద్, ఎంఈవో-2 రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **నగరి:** మండల స్థాయిలో చెకుముకి పోటీలు మంగళవారం జడ్పీ బాలికోన్నతపాఠశాలలో నిర్వహించారు. పుదుపేట జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులు ప్రథమ, సత్రవాడ జడ్పీ ఉన్నతపాఠశాల ద్వితీయ, చింతలపట్టడ జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులు తృతీయ స్థానం సాధించినట్లు నిర్వాహకులు ప్రకటించారు.

ఏచూరి కర్షకులు, శ్రామికుల పక్షపాతి



ఏచూరి సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు, న్యూస్‌టుడే: సీపీఎం నేత సీతారాం ఏచూరి నిరంతరం కర్షకులు, శ్రామికుల సమస్యలపై పోరాటం చేశారని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. పుత్తూరు విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో మంగళవారం సీతారాం ఏచూరి సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య, ఏలుమలై, వడమాలపేట జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం

చిత్తూరు (కొంగారెడ్డిపల్లి): చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో మంగళవారం ఐరాలకు చెందిన ధనశేఖర్, లయ దంపతులు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

గాంధీ సిద్ధాంతాలు ఆచరణీయం

పుత్తూరు: శాంతి, సత్యం, ధర్మం, అహింస సిద్ధాంతాలు ప్రపంచశాంతికి ఆచరణీయం అని ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య పేర్కొన్నారు. పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ వీరయ్య, అధ్యాపకులు సుజన, నరసింహులు, కృష్ణయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమమైనా అడిగేవారెవరు..?

● యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు
● ప్రభుత్వ ఆదాయానికి గండి

❖ యాదమరి పంచాయతీ, మండల కేంద్రానికి సమీపంలో పెరుమాళ్లపల్లి వద్ద చెన్నై- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే ఆనుకుని సర్వే నెంబరు 52 లో ఓ లేఅవుట్ వెలసింది. ఇది వరకు ఆ స్థలంలో శిథిలావస్థలోని ఓ చిన్న పరిశ్రమ ఉండేది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆస్థలాన్ని కొనుగోలు చేసి చదును చేసి లేఅవుట్ వేస్తున్నారు. అయితే ఆ స్థలానికి సంబంధించి భూమార్పిడి జరిగిన దస్త్రాలు సమర్పించాలని పలుమార్లు రెవెన్యూ సిబ్బంది కోరినా ఎంతకూ ఇవ్వక పోవడంతో, సోమవారం వీఆర్వో రేఖ సిబ్బందితో కలిసి ఆ లేఅవుట్‌లో పనులు అడ్డుకున్నారు.

❖ చిత్తూరు గ్రామీణ మండలం తాణా సమీపంలో లే అవుట్ వేశారు. దీనికీ పంచాయతీ అప్రూవల్ లేదు. చెన్నై- బెంగళూరు జాతీయ రహదారిలో బంగారుపాళ్యం, యాదమరి మండలాల సరిహద్దులో లే అవుట్ వేశారు. అక్కడా ఎలాంటి పంచాయతీ అప్రూవల్ కానీ, భూ బదలాయింపు గానీ జరగలేదు. ఇలా పలు ప్రాంతాల్లో లే అవుట్లుగా మారాయి.



యాదమరి మండలం పెరుమాళ్లపల్లి వద్ద లేఅవుట్‌లో పనులు చేస్తున్న యంత్రాలు

యాదమరి, న్యూస్‌టుడే: స్థిరాస్తి వ్యాపారాలు ఇళ్ల స్థలాల కొరత సాకుగా చూపి, వ్యవసాయ భూములను స్థలాలుగా మార్చేసి విక్రయిస్తున్నారు. భూ బదలాయింపు (ల్యాండ్ కన్వర్షన్) జరగకపోయినా నిబంధనలు పాటించకుండా విక్రయాలు చేస్తున్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని యాదమరి, పూతలపట్టు, బంగారుపాళ్యం, చిత్తూరు గ్రామీణ మండలాలతో పాటు జీడీనెల్లూరు, నగరి, చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో అక్రమ లేవుట్లు వెలిశాయి. ఆయా ప్రాంతాల్లో సుమారు 120 పైగా అనధికార లేఅవుట్లు వెలిశాయంటే పరిస్థితి అర్థమవుతుంది. రూ.కోట్ల విలువైన భూముల క్రమ విక్రయాలకు అనుమతులు తీసుకోకపోవడంతో ప్రభుత్వం భారీగా ఆదాయం కోల్పోవాల్సి వస్తోంది.

అధికారుల ఉదాసీనత

అక్రమ లే అవుట్లు వెలసిన వెంటనే సంబంధిత మున్సిపల్, పంచాయతీ అధికారులు దృష్టి సారించి వెంచర్లలో పాతిన రాళ్లు ఎప్పటికప్పుడు తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి, పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది. జిల్లా స్థాయి అధికారులు మేల్కొని అక్రమ లే అవుట్లపై కొరడా ఝులిపించాల్సిన అవసరం ఉంది.



పెరుమాళ్లపల్లి వద్ద పనులు ఆపేయాలని చెబుతున్న వీఆర్వో రేఖ

ప్రమాదకర ప్రాంతాల్లోనూ లేఅవుట్లు

కాలువలు, కల్వర్టులు, వంతెనలు, హైవోల్టేజీ విద్యుత్తు స్తంభాలు ఉన్న ప్రాంతాల్లో కూడా లే అవుట్లు ఏర్పాటు చేస్తుండటం గమనార్హం. ఇటు రహదారి వస్తుందని, అటు ప్రముఖ సంస్థలు వస్తున్నాయంటూ సామాన్య మధ్య తరగతి ప్రజలకు మాయమాటలు చెప్పి సదరు స్థలాలు అంటగడుతున్నారు. వీటిని కొనుగోలు చేసిన వారు ఇళ్ల నిర్మించుకునే సందర్భంలో పంచాయతీకి, పురపాలక సంఘాలకు 14 శాతం అపరాధ రుసుం చెల్లించాల్సి వస్తోంది.

భూ బదలాయింపు వివరాలు ఇవ్వలేదు

పెరుమాళ్లపల్లి వద్ద లేఅవుట్‌కు సంబంధించిన కన్వర్షన్ వివరాలు ఇమ్మని అడిగాం. ఇంత వరకూ ఇవ్వలేదు. పనులు ఆపేయాలని ఆదేశించాం.
- పార్థసారథి, తహసీల్దారు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ జరగకుండా తెదేపా, జనసేన అడ్డుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ డిమాండ్ చేశారు. నగరంలో మంగళవారం సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించి మాట్లాడారు. లాభాల్లో ఉన్న కర్మాగారాన్ని స్వలాభం కోసం కేంద్రం ప్రైవేటు పరం చేయడానికి చూస్తోందని ఆరోపించారు. కేంద్రంపై ఉద్యమించాల్సిన తెదేపా, జనసేన ద్వంద్వ వైఖరి ప్రదర్శించడం దారుణమన్నారు. గోపినాథ్, చంద్ర, విజయగౌరీ, ఆర్ముగంరెడ్డి, విజయకుమార్ పాల్గొన్నారు.

క్రీడల్లో కేకేసీ విద్యార్థుల ప్రతిభ

పుత్తూరు,న్యూస్‌టుడే: అంతర కళాశాలల క్రీడా పోటీల్లో కేకేసీ ఫిజియోథెరపీ విద్యార్థులు ప్రతిభ చూపడం ఎంతో సంతోషంగా ఉందని కళాశాల ఛైర్మన్ కుప్పయ్యశెట్టి పేర్కొన్నారు. పరమేశ్వరమంగళంలోని కేకేసీ విద్యాసంస్థల్లో మంగళవారం విద్యార్థులను అభినందించి మాట్లాడారు. కోనసీమ జిల్లాలో జరిగిన పోటీల్లో వాలీబాల్, బ్యాడ్మింటన్, డ్యాన్స్ విభాగాల్లో విజేతలుగా నిలిచారన్నారు. వైస్ ఛైర్మన్ నరసింహారావు, ప్రిన్సిపల్ మగేష్, అడ్వైజర్ హరినాథ్‌శెట్టి, ఏవో బాలాజీ పాల్గొన్నారు.

ఒంటరితనం భరించలేక వ్యక్తి ఆత్మహత్యాయత్నం

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: నగర పరిధి తేనబండలోని ధర్మరాజుల గుడి వద్ద ఉన్న కారు పార్కింగ్ షెడ్డులో మంగళవారం వినోద్ కుమార్‌రెడ్డి (50) వ్యక్తి వంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గుర్తించి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్వామిరెడ్డి వీధికి చెందిన ఆయన ఒంటరిగా ఉంటున్నారు. బాడుగలతో జీవనాన్ని సాగిస్తున్నాడు. భార్యతో విడాకులు, పిల్లలు దూరంగా ఉండడంతో ఒంటరితనాన్ని భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చిత్తూరు రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు

98 శాతం పింఛన్ల పంపిణీ

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పురపాలిక పరిధిలోని 12 సచివాలయాల్లో 5023 సామాజిక భద్రతా పింఛన్లు ఉండగా.. 98 శాతం మొదటి రోజే పంపిణీ చేసినట్లు పురపాలిక కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. పురపాలిక పరిధిలో ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, పురపాలిక, సచివాలయాల సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి మంగళవారం పింఛన్లు అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు దాతల సాయం

పలమనేరు: పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 20 అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీలు, వాటర్‌క్యాన్లు, మ్యాట్లు ఉచితంగా అందజేశారు. పట్టణానికి చెందిన దాతలు శ్రీపురం సీతారామయ్య, రత్నాబయోటెక్ నిర్వాహకులు సంయుక్తంగా మంగళవారం పంపిణీ చేశారు. ప్రాజెక్టు అధికారి ఇందిరాప్రియదర్శిని, సూపర్‌వైజర్ నజ్మా, అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని వాణి డిగ్రీ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం నిర్వహించారు. సంస్థ సభ్యులు రక్తదానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పలమనేరు, న్యూస్‌టుడే

సమస్య: పట్టణంలోని టీఎస్ అగ్రహారం రోడ్డులో వీధిదీపాలు వెలగడం లేదు. రాత్రి సమయాల్లో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉంది. **– మురగేష్, పలమనేరు**

సమాధానం: దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. **– రూపేష్, ఏఈ, పురపాలక కార్యాలయం, పలమనేరు**

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే:

సమస్య: నెక్కుంది పంచాయతీలో మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు.**– శ్రీనివాసులు, నెక్కుంది**

సమాధానం: మురుగు కాలువలు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లిస్తాం. **– బసవరాజ, కార్యదర్శి**

న్యూస్‌టుడే, పుంగనూరు:

సమస్య: నక్కబండలో పలుచోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. చీకటిగా ఉండటంతో పిల్లలు, మహిళలు భయపడుతున్నారు.**– రహ్మాత్, నక్కబండ**

సమాధానం: సంబంధిత అధికారులతో మాట్లాడి వీధిదీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.**– మధుసూదన రెడ్డి, పురపాలక కమిషనరు**

కూటమి ప్రభుత్వంతో అభివృద్ధికి రెక్కలు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో రాష్ట్రం సంక్షోభంలోకి వెళ్లిందని, కూటమి ప్రభుత్వంతో అభివృద్ధికి రెక్కలొచ్చాయని తెదేపా మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. 21వ వార్డులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు దాము, సోమశేఖర్, నాయకులు ప్రతాప్‌కుమార్, గోపీనాథ్, వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెదేపా మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, పురపాలిక కమిషనర్ శ్రీనివాసరావు

హక్కుల కోసం కేసు పెట్టొచ్చు

పలమనేరు, న్యూస్‌టుడే: సీనియర్ సిటిజన్లు తమ హక్కుల కోసం కోర్టులో కేసులు పెట్టవచ్చని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి లిఖిత తెలిపారు. పట్టణంలోని కోర్టులో సీనియర్ సిటిజన్ల న్యాయ విజ్ఞాన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులను సంరక్షించని కుమారుల మీద కోర్టులో ఫిర్యాదు చేయవచ్చన్నారు. పెన్షన్లు సక్రమంగా అందకపోయినా సంబంధితశాఖ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సీనియర్ సిటిజన్లు

అర్హులందరికీ ఓటు హక్కు

18 ఏళ్లు నిండినవారు అర్హులు ◆ ప్రత్యేక యాప్‌లో నమోదు

ముసాయిదా జాబితా విడుదల	:	అక్టోబరు 29
అభ్యంతరాల స్వీకరణ	:	నవంబరు 28
తుది జాబితా ప్రచురణ	:	2025 జనవరి 6

పుంగనూరు, న్యూస్‌టుడే: కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు 'స్పెషల్ సమ్మరీ రివిజన్' (ఎస్ఎస్ఆర్-24) నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆగస్టు 20 నుంచి అక్టోబరు 18 వరకు బూత్‌స్థాయి అధికారుల (బీఎల్వో)ల ద్వారా ఇంటింటి జాబితా పరిశీలన చేపడుతోంది. బీఎల్వోలు ప్రతి ఇంటికి వెళ్లి కొత్తగా ఓటర్ల నమోదు, మృతులను తొలగించడం, సక్రమంగా లేని ఫోటోలు సరిదిద్దడం, డబుల్ ఎంట్రీలు తొలగించడం, చిరునామాలు, పేర్లలో తప్పులు సవరించడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

ఏటా జనవరిలో ఓటర్ల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేస్తోంది. దీనిపై ఆరు నెలల ముందు నుంచే కసరత్తు చేపడతారు. ఈ సమయంలోనే పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు, సదుపాయాలు కూడా పరిశీలించడం, అవసరాన్ని బట్టి హేతుబద్ధీకరణ చేస్తారు. అక్టోబరు 18వరకు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. సవరణ చేయడానికి వీలుగా ఫారం-6, ఫారం-7, ఫారం-8 వంటివి అందజేస్తున్నారు.



పుంగనూరు మండలం భీమగానిపల్లెలో ఓటు వేయడానికి బారులు తీరిన ఓటర్లు (పాతచిత్రం)

సార్వత్రిక ఎన్నికల నాటికి మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	మొత్తం	మహిళలు	పురుషులు	ఇతరులు
పుంగనూరు(రూ)	42,981	21,844	21,137	0
పట్టణం	43,620	22,517	21,102	1
చౌడేపల్లె	35,450	17,968	17,482	0
సోమల	34,645	17,596	17,049	0
సదుం	27,925	14,173	13,751	1
రొంపిచర్ల	22,476	11,508	10,968	0
పులిచర్ల	31,771	16,185	15,583	3

ప్రత్యేక యాప్‌లో నమోదు

2025 జనవరి ఒకటి నాటికి 18ఏళ్లు నిండినవారు కొత్తగా ఓటు హక్కుకు వినియోగించుకునేందుకు అర్హులు. ఈ మేరకు చేర్పుల నిమిత్తం ఎవరైనా 18 ఏళ్లు నిండినవారు ఉంటే వివరాలు ఇప్పటి నుంచే బీఎల్వోలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. డిసెంబరు 24 వరకు అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాత నవీకరించిన తుది జాబితాను విడుదల చేస్తారు.

ఓటర్లు వినియోగించుకోవాలి

నియోజకవర్గంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ జరుగుతోంది. ఇంటింటికి వస్తున్న బీఎల్వోలకు వివరాలు అందజేస్తే ఆన్‌లైన్ చేస్తారు. అవకాశం ఉన్నవారు ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ఓటు నమోదు చేసుకుంటే విచారణ జరిపి ఓటును జాబితాలో చేరుస్తాం.**– రాము, తహసీల్దారు, పుంగనూరు**

పైపులైనుకు మరమ్మతు

స్పందనకు వందనం

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: మండలంలోని కోగిలేరు పంచాయతీ బసవరాజుకండ్రిగ సమీపంలోని ప్రభుత్వ కాలనీకి నీటిని సరఫరా చేసే పైపులైను మరమ్మతుకు గురైంది. నీటి సమస్య తలెత్తడంతో 'ఈనాడు'లో 'మేమున్నాం...మీకు తోడుగా' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన స్థానిక సర్పంచి రమేష్‌బాబు పైపులైను బాగుకు చర్యలు చేపట్టారు.

ఇసుక మేటల తొలగింపు

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని మదనపల్లె రోడ్డులో రాయలచెరువు కాలువలో పేరుకుపోయిన ఇసుక మేటలను పురపాలక కార్మికులు తొలగించారు. మంగళవారం 'ఈనాడు' పత్రికలో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన కమిషనరు మధుసూదనరెడ్డి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

గుడుపల్లెలో చెత్త..

గుడుపల్లె, న్యూస్‌టుడే: గుడుపల్లె పంచాయతీ కాడేపల్లె శివాలయం వీధిలో పేరుకుపోయిన చెత్తాచెదారాల సమస్యపై 'మేమున్నాం..మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన స్థానిక పంచాయతీ కార్యదర్శి అజహర్ బాషా వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకున్నారు.

పారిశుద్ధ్య పనులు

ఈనాడు కథనానికి స్పందన

వి.కోట, న్యూస్‌టుడే: మండల వైద్య సిబ్బంది స్థానిక గంగమ్మ ఏరులో సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. 'ఈనాడు' పత్రికలో సోమవారం 'పెరుగుతున్న విష జ్వరాలు' శీర్షికన వచ్చిన కథనానికి వైద్య సిబ్బంది స్పందించారు. ఈ సందర్భంగా గంగమ్మ ఏరు పరిసర ప్రాంతాల ప్రజలకు డెంగ్యూ, ఇతర జ్వరాల గురించి అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు.

గిరిజనులందరికీ గుర్తింపు కార్డులు

బోయకొండ(చౌడేపల్లె), న్యూస్‌టుడే: గిరిజనుల వివరాలు నమోదు చేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు జేసీ విద్యాధరి సూచించారు. బోయకొండ వద్ద ఉన్న గిరిజనుల కాలనీలను మంగళవారం సందర్శించారు. పలువురు గిరిజనులు సమస్యలను ఆమెకు విన్నవించారు. పట్టాలున్న భూములను ఎకోటూరిజం పేరుతో అధికారులు తీసేసుకున్నారని జేసీ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆమె భూముల వివరాలను పరిశీలించడానికే వచ్చానని చెప్పారు. రీసర్వే చేసి అర్హులకు భూములు ఇవ్వాలన్నారు. పూర్తి వివరాలు సేకరించి నివేదిక పంపాలని తహసీల్దారు హనుమంతుకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ భారతి, వీర్వో రాజన్న పాల్గొన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

బాధితులకు నష్టపరిహారం

వి.కోట, న్యూస్‌టుడే: ప్రజల ప్రశాంతతకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వి.కోటలో సెప్టెంబరు2 జరిగిన ఘటనలో నష్టపోయిన బాధితులకు నష్ట పరిహార కార్యక్రమంలో ఎమ్మెల్యే, కలెక్టరు సుమిత్ కుమార్, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఘటనలో నష్టపోయిన 54మంది చిన్న వ్యాపారస్థులను గుర్తించినట్లు వారు పేర్కొన్నారు. వీరికి దాత అమ్మాయక్క స్వచ్ఛంద సంస్థ అధినేత దశరథరెడ్డి ముందుకొచ్చి రూ.5.32లక్షల చెక్కును అందజేశారు. ఇంకా ఎవరైనా నష్టపోయిన బాధితులు ఉంటే తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్వతి, ఎంపీడీవో మహ్మద్ రఫి, మార్కెటు కమిటీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు పాల్గొన్నారు.



కలెక్టరు సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి చెక్కును అందజేస్తున్న దాత దశరథరెడ్డి

వర్షం పడితే రాకపోకలకు ఇక్కట్లు

మండలంలోని నంజంపేట-సదుం మార్గంలో కమ్మపల్లె వద్ద తారురోడ్డు దెబ్బతిని గుంతలమయమైంది. దాంతో కొద్దిపాటి వర్షం పడితే నీరు నిలిచి వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని గుంతలు పూడ్చి ఇబ్బందులు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



- న్యూస్‌టుడే, సోమల

అర్ధాంతరం.. అలంకార ప్రాయం..!

శాంతిపురం మండలం సి.బండపల్లె పంచాయతీలో ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం వైకాపా సర్కారు ఖర్చు చేసిన నిధులకు సార్థకత లేకపోయింది. గ్రామ సచివాలయం భవనం నిర్మాణం నాలుగేళ్లుగా పూర్తికి నోచుకోలేదు. విలేజ్ హెల్త్ క్లీనిక్, రైతు సేవా భవనాలకు అదనపు సౌకర్యాలు లేనందున వినియోగానికి నోచుకోలేదు. రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు పూర్తికి నోచుకోకపోవడం. వసతులు కొరవడి నిరుపయోగంగా మారడంపై స్థానికులు విమర్శిస్తున్నారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పంచాయతీ కార్యదర్శి హరీష్ తెలిపారు. **న్యూస్‌టుడే, శాంతిపురం**



గోతులతో వాహనచోదకుల పరేషాన్..!

చెన్నై-ముంబయి జాతీయ రహదారిలో ఉన్న గోతుల కారణంగా వాహనచోదకులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. పుంగనూరు సమీపంలో బండ్లపల్లె టోల్ ప్లాజా నుంచి పలమనేరు మార్గంలో శ్రీరామాపురం, ముత్తుకూరు క్రాస్, లింగాపురం క్రాస్, పెద్దపంజాణి, ఒంటిల్లు, కల్లుపల్లె క్రాస్, అప్పినపల్లె క్రాస్ పెట్రోలు బంకు రోడ్డులో గోతులు పడ్డాయి. ద్విచక్రవాహన చోదకులు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. **- న్యూస్‌టుడే, పెద్దపంజాణి**





మాట్లాడుతున్న జనసేన జిల్లా కార్యదర్శి పగడాల రమణ

పవన్‌కల్యాణ్ పర్యటనకు తరలిరండి

పుంగనూరు, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తిరుపతి-తిరుమల పర్యటనకు నియోజకవర్గంలోని ఆయన అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని జనసేన జిల్లా కార్యదర్శి పగడాల రమణ కోరారు. మంగళవారం స్థానికంగా నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం ఉదయం శ్రీవారి దర్శనం అనంతరం తిరుమల ఘటనలపై సమీక్ష, సాయంత్రం తిరుపతిలో జ్యోతిరావుపులే కూడలిలో వారాహి సభ నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమాల విజయవంతానికి తరలి రావాలన్నారు. సమావేశంలో నాయకులు విరూపాక్షి, నరేష్, చైతన్య, హరినాయక్, బాలాజీ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

సదుం, న్యూస్‌టుడే: మండలంలోని జాంద్రపేటకు చెందిన ఆశాకార్యకర్త నాగమల్లమ్మ కుమారుడు చంద్రశేఖర్ అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందారు. మంగళవారం చెరుకువారిపల్లె పీహెచ్‌సీ ఆశా కార్యకర్తలు డాక్టర్ గిరీషా ఆధ్వర్యంలో రూ.17వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి జానకి, ఆరోగ్యపర్యవేక్షణ అధికారి శిఖామణి, ఆరోగ్యకార్యకర్తలు హేమలత, రేవతి పాల్గొన్నారు.

రైతులు నిర్లక్ష్యం చేయరాదు

పుంగనూరు, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులపై రైతులు నిర్లక్ష్యం చేయరాదని జిల్లా విజిలెన్స్ అధికారి, వాటర్‌షెడ్ అదనపు పీడీ ఉమావాణి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పీఆర్ అతిథి భవనం ఆవరణలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను పుంగనూరు మండలంలో ఉపాధి పథకం కింద రూ.9.57కోట్ల పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభలో విచారణ చేపట్టారు. మొక్కల పెంపకంలోనే రూ.2.15లక్షల విలువ చేసే మొక్కలు ఎండిపోయినట్లు తనిఖీ బృందం గుర్తించారన్నారు. సంబంధిత రైతుల నుంచి తిరిగి వాటి స్థానంలో మొక్కలు నాటాలని ఆదేశించారు. ఎంపీడీవో అబ్దుల్ రహీం, ఏఈలు సుబ్రహ్మణ్యం రెడ్డి, చందన పాల్గొన్నారు.



సామాజిక బహిరంగ సభలో విచారిస్తున్న ఏపీడీ ఉమావాణి

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి

శాంతిపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న బిందుసేద్యం రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు కోరారు. మంగళవారం మండల సచివాలయం ప్రాంగణంలో రైతులకు బిందుసేద్యం సామగ్రి పంపిణీ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రూ.35 లక్షల రాయితీతో 35 హెక్టార్లకు సంబంధించి 40 మంది రైతులకు రాయితీ పథకం మంజూరు పత్రాలు అందజేశారు. ఏపీఎంఐపీ జిల్లా అధికారి బాలసుబ్రహ్మణ్యం, ఉద్యానశాఖ ఏడీ కోటేశ్వరావు పాల్గొన్నారు.



బిందుసేద్యం రాయితీ పత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్య.. రామకుప్పం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని కుప్పం ఆర్డీవో శ్రీనివాసరాజు అన్నారు. మండలంలోని బగళనత్తం ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన తీరు నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నారాయణ, ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు..శాంతిపురం: మండల పరిధిలో స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా 2,150 కుటుంబాలకు వ్యక్తిగత మరుగుదొడ్ల వసతికి చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

జలసంరక్షణకు ప్రాధాన్యం.. శాంతిపురం: ఉపాధి హామీ ద్వారా జలసంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో కుమార్ సూచించారు. మఠం, సంతూరు గ్రామాల వద్ద ఉపాధి పనులను మంగళవారం తనిఖీ చేశారు. చెరువులు, కుంటల్లో ఫారం పాండ్ల తవ్వకాలను విస్తృతంగా చేపట్టాలని తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని 23 పంచాయతీల్లో వంద నీటి కుంటల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి.. పెద్దబదనవాడ(గుడుపల్లె): తీవ్ర వర్షాభావంతో పశుపోషణ భారమై నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులను కోరారు. పెద్దబదనవాడ, కంచిబందార్లపల్లె గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి నాగరాజు పర్యవేక్షణలో మంగళవారం నిర్వహించారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

కల్లూరు: ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకమని జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్త మహేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం దేవళంపేట పంచాయతీ వంకాయలపాటివారిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి.. బైరెడ్డిపల్లె: ఆరోగ్య విషయంలో బాలికలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని హెచ్ఈ సావిత్రి అన్నారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో మంగళవారం బాలికలకు ఆరోగ్య విషయాల గురించి ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని గౌహర్‌సుల్తానా, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

50 మందికి నేత్ర పరీక్షలు.. బైరెడ్డిపల్లె: తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కోలారు జాలప్ప ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో 50 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. 17 మందిని నేత్ర శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు హర్షిత, వైద్యాధికారి అరుణ్‌కుమార్, సూపర్‌వైజర్ శ్రీదేవి పాల్గొన్నారు.

మద్యం దుకాణాల ఎదుట ధర్నా.. పలమనేరు: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఏపీ మద్యం దుకాణాల సిబ్బంది ఆందోళన చేశారు. మంగళవారం ఎంబీటీ రహదారిలో ఉన్న దుకాణాల ఎదుట వారు ఆందోళన చేశారు. ప్రభుత్వ కాంట్రాక్టు ముగియడంతో తమకు ఉద్యోగాలు ఉండవని వాపోయారు. దుకాణాలు ప్రైవేటు పరమైనా ఉద్యోగాలు కల్పించాలన్నారు.

వృద్ధులను గౌరవించాలి.. సదుం: సమాజంలో వృద్ధులను గౌరవించాలని డాక్టర్ పుష్పకుమారి తెలిపారు. వృద్ధుల దినోత్సవం సందర్భంగా స్థానిక సీహెచ్‌సీ వైద్యశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. వారి అనుభవాలు సమాజానికి ఎంతో అవసరమని వృద్ధుల పట్ల ప్రేమతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, రమాదేవి, డాక్టర్లు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక.. సదుం, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థి గిరీష్‌కుమార్ ట్రిపుల్‌ఐటీ(ఇడుపులపాయ)కు ప్రత్యేక ప్రతిభావంతుల కోటాలో ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జయకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

బాలిక అదృశ్యం.. శాంతిపురం: మండలంలోని ఓ గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక అదృశ్యం ఘటనపై కేసు నమోదు చేసినట్లు రాళ్లబూదుగూరు పోలీసులు మంగళవారం తెలిపారు. కుప్పంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బాలిక సోమవారం కళాశాలకు వెళ్లి.. తిరిగి ఇంటికి చేరకపోవడంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పంటలపై ఏనుగుల దాడులు.. కల్లూరు: మండలంలోని తుడుంవారిపల్లె వ్యవసాయ పొలాల్లో మంగళవారం ఏనుగుల పొలలపై పడి ధ్వంసం చేశాయి. గ్రామానికి చెందిన శ్రీనివాసులు సాగు చేసిన అర్థ ఎకరా పశుగ్రాసం, ఇదే గ్రామానికి చెందిన రాజన్న సాగు చేసిన అర్థ ఎకరా వరి పంటను నాశనం చేశాయి.



విద్యార్థులను అభినందిస్తున్న కేడీసీ వైస్ ఛైర్మన్ సాగర్‌రాజ్

క్రీడా పోటీల్లో కేడీసీ విద్యార్థుల ప్రతిభ

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి అథ్లెటిక్ క్రీడా పోటీల్లో కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు కళాశాల వైస్ ఛైర్మన్ సాగర్‌రాజ్ తెలిపారు. హైజంప్ పోటీల్లో మౌనిక మొదటి స్థానం, షాట్‌పుట్‌లో ఎం.దర్శిని ద్వితీయస్థానంలో నిలిచినట్లు తెలిపారు. 4 నుంచి 6వ తేదీ వరకు రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని మంగళవారం ఆయన తెలిపారు.

గ్రామీణ విద్యార్థులు.. క్రీడల్లో మెరికలు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పుంగనూరు గ్రామీణ, చౌడేపల్లె, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. సరైన సౌకర్యాలు లేకపోయినా క్రీడలపై ఉన్న ఆసక్తి, పట్టుదల, కృషితో రాష్ట్రస్థాయి క్రీడల్లో పోటీ పడేందుకు సిద్ధమవుతున్నారు. ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్తున్నామని వారి మనోభావాలను 'ఈనాడు'తో పంచుకున్నారు.



పోలీసు కావడమే లక్ష్యం



పుంగనూరు మండలం అడవినాథునికుంట ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్.మేఘన 2023లో చిత్తూరులో జరిగిన అండర్-17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కబడ్డీ పోటీల్లో జట్టు విజయానికి కృషి చేసింది. ఈ ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. విశాఖపట్నంలో జరిగే ఈ పోటీలకు శిక్షణ పొందుతోంది. భవిష్యత్తులో పోలీసు అధికారై పేదలకు సేవ చేయడమే లక్ష్యం అంటోంది మేఘన.

జాతీయస్థాయిలో ఆడాలి..



చౌడేపల్లె మండలం పుదిపట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని గత నెల 26న చిత్తూరులో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీలో హైజంప్, 100 మీటర్ల పరుగు పందెంలో గెలుపొందింది. ఈ నెల 9న కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో హైజంప్, 200 మీటర్ల పరుగు పందెంకు సిద్ధపడుతోంది. భవిష్యత్తులో జాతీయస్థాయిలో ఆడటమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు చెబుతోంది ప్రణిత.

వాయుసేనలో ఉద్యోగమే ధ్యేయం



నిరుపేద కుటుంబంలో జన్మించినా పట్టుదలతో చదువులో రాణిస్తూనే.. క్రీడల్లోనూ సత్తాచాటుతోంది పుదిపట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న లాస్య. 2023లో విజయనగరం జిల్లాలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో పరుగు పందెంలో పతకం సాధించింది. ఈ నెల 9న కాకినాడలో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో 200 మీటర్ల పరుగు పందెం కోసం తర్ఫీదు పొందుతోంది. వాయుసేనలో చేరడమే లక్ష్యమంటోంది లాస్య.

ఉత్తమ ఫలితాల సాధనకు క్రమశిక్షణే దిక్సూచి

గుడుపల్లె, న్యూస్‌టుడే: పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు, ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు విద్యార్థులకు క్రమశిక్షణ ఓదిక్సూచి అని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ వై.రామకృష్ణమరాయుడు అన్నారు. గుడుపల్లెలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం 'ఫ్రెషర్స్ డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. వేదికపై విద్యార్థుల నృత్యప్రదర్శనలు, ఉపన్యాసాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కుప్పం, శాంతిపురం, రామకుప్పం ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు వాసుదేవ రెడ్డి, విజయ్‌కుమార్, చాణిక్యుడు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ప్రిన్సిపల్ రామకృష్ణమనాయుడు

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పోటీలు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: విద్యార్థులు సైన్సు పట్ల అవగాహన పెంచుకుని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలని ఎంఈవో సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. స్థానిక బాలుర జడ్పీ పాఠశాలలో మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలస్థాయిలో నిర్వహించిన చెకుముకి పరీక్షల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. **పెద్దపంజాణి:** పెద్దపంజాణి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేశవపిళ్లై ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను మంగళవారం నిర్వహించారు. **పలమనేరు:** సైన్స్ ఫలాలు విద్యార్థులకు అందాలని జిల్లా జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు గిరిధరమూర్తి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో చెకుముకి సంబరాలను నిర్వహించారు. **కల్లూరు, న్యూస్‌టుడే:** సమాజంలో ఉన్న మూఢ నమ్మకాలను పారదోలి జన విజ్ఞాన వేదికను బలోపేతం చేయాలని ఆ కమిటీ కన్వీనరు వేణుగోపాల్, పీలేరు డివిజన్ కన్వీనరు రాజేంద్ర పిలుపునిచ్చారు. పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక కొత్త ఇండ్లు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి చెకుముకి టాలెంట్ పరీక్షలు నిర్వహించారు.



ఇలా చేశారేం గణేశా..!

పురపాలిక పరిధిలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమల నిమజ్జన కార్యక్రమాన్ని దళవాయి కొత్తపల్లె చెరువులో నిర్వహించారు. అయితే ఆ చెరువులో విగ్రహాలు మునిగేంత నీరు లేకపోవడంతో అలానే ఉన్నాయి.

- న్యూస్‌టుడే, కుప్పం పట్టణం